
బాబు ష్యూరిటీ.. నో క్లారిటీ !

- ఎన్నికల హామీల ఊసే ఎత్తని కూటమి నేతలు
- ఏదో చేస్తారని నమ్మి మోసపోయిన ప్రజలు
- గత ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ పథకాలు



తుని: ప్రజలను ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు తెలిసినంత మరొకరికి తెలియదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో పేదలను ధనవంతులను చేస్తామని చంద్రబాబు చెబితే, మేమిచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపిస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. ఇది నమ్మిన ప్రజలు ఓటు వేసి కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారు. అధికారం చేపట్టి వంద రోజులు అవుతున్నా ఒక్క పింఛన్ తప్ప మిగిలిన హామీలను అమలు చేయడంతో కూటమి నేతలు విఫలమయ్యారు. నమ్మి ఓటు వేసినందుకు నిలువునా మోసపోయామని అన్నివర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్లబొల్లి మాటలు చెప్పి...

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో 6 లక్షల మంది ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్టీఆర్ రైతు భరోసా, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు భృతి, మహిళలకు నెలకు రూ.1500 తదితర వాటిని ఇస్తామని చెప్పి 100 రోజులు అవుతున్నా అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసి ప్రజలను ఆర్థికంగా ఆదుకున్నారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

తుని బహిరంగ సభలో...

చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అంటూ మోసం చేస్తే, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తుని గొల్ల అప్పారావు సెంటర్లో ఎన్నికల సభలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. కత్తిపూడిలో జరిగిన సభలోనూ ఇదే మాటను వల్లించారు. తుని నియోజకవర్గానికి సంబంధించి తుని కూరగాయల మార్కెట్‌లో సదుపాయాలు, తాండవ నదికి కరటకట్ట నిర్మాణం, తాండవ సుగర్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం, లోవ దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన వైద్య సదుపాయాలు, ప్రజలకు రక్షిత మంచి నీరు, రోడ్లు అభివృద్ధి తదితర వాటిని పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి 100 రోజులు గడుస్తున్నా వీటిలో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. సంక్షేమానికి మంగళం పాడిన కూటమి నేతలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేదు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే సంక్షేమాన్ని అందించి అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు.



తుని గొల్ల అప్పారావు సెంటర్లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్ (ఫైల్)

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో హామీలను అమలు చేయడంలో విఫలమైంది. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కి ప్రజలను వంచించింది. ఇటీవల విజయవాడలో వరద ముంపునకు గురైన ప్రజలను ఆదుకోవడంలోనూ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. అన్నివిధాలా విఫలమైన కూటమి నేతలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ప్రజావేదికలు నిర్వహించి ఎంతో మేలు చేసినట్టు చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– తోట నరసింహం, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జగ్గంపేట నియోజకవర్గం

హామీలను తక్షణమే అమలు చేయాలి



ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఎక్కడికి పోయాయి. అమ్మకు వందనం, నిరుద్యోగ భృతి, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు సర్వీసు, 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇలా ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేయాలి.

– బొద్దు నాని, వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు, ఎ.మల్లవరం, రౌతులపూడి

తల్లికి వందనం అందక అవస్థలు



ఈ ఏడాది తల్లికి వందనం (అమ్మఒడి) ఆర్థిక సాయం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం బడులు తెరిచే నాటికే అమ్మఒడి డబ్బులు విడుదల చేయడంతో పిల్లల ఫీజులు, పుస్తకాలు వంటి అవసరాలు తీర్చేందుకు తల్లిదండ్రులకు ఇబ్బంది ఉండేది కాదు. అధికారం చేపట్టి 100 రోజులు గడుస్తున్నా.. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం నిధులు విడుదల చేయకపోవడం అన్యాయం. ప్రస్తుతం పిల్లల చదువు భారంగా మారింది. ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం నిధులు విడుదల చేయాలి.

– వాదపర్తి సుబ్బు, విద్యార్థి తండ్రి, కోటనందూరు

క్లుప్తంగా

కళాశాలలో వసతులు కల్పించాలి

జగ్గంపేట: మండలంలోని రాజపూడి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ విజృంభణ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాజపూడిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువత ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

గండేపల్లి: యువత ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నూతన లియో క్లబ్ సంస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లియో క్లబ్ ద్వారా తమ సేవలను విస్తృత పరచి సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తోటి వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీన్ వి.సత్యనారాయణ, ఎస్.నరేష్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

రౌతులపూడి: మండలంలోని ఎస్ఎన్ పట్నంలో శుక్రవారం పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల పశువైద్యాధికారి ఎం.వీర్రాఘవరావు ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు సంక్రమించే వివిధ వ్యాధులు, వాటి నివారణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

నేడు మురారిలో ప్రజావేదిక

గండేపల్లి: మండలంలోని మురారిలో శనివారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామన్ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల ద్వారా తెలియజేయాలని కోరారు.

ఆసుపత్రికి రిఫ్రిజిరేటర్ బహూకరణ



తుని ఏరియా ఆసుపత్రిలో రిఫ్రిజిరేటర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

తుని: స్థానిక ఏరియా ఆసుపత్రికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు రిఫ్రిజిరేటర్ బహూకరించారు. ఈ రిఫ్రిజిరేటర్‌ను మాజీ ఎమ్మెల్యే రాజాఅశోక్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. రిఫ్రిజిరేటర్ అందజేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తటపర్తి రాజా, గంటా చిన్నారావు, కుక్కడపు బాలాజీ, మళ్ల గణేష్, నార్ల రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి ఈ పోటీలను ప్రారంభించారు. అండర్–14, అండర్–17 బాలురు విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్‌స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం

గోకవరం: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. వినాయక చవితి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో పల్లవికి ప్రథమస్థానం



పల్లవి

తొండంగి: జిల్లా కేంద్రమైన కాకినాడలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని వాకదారిపేట కేజీబీవీ విద్యార్థి డి.పల్లవి ప్రథమ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. కాకినాడ సాలిపేట గరల్స్ హైస్కూల్లో ఈ నెల 17న 'స్వచ్ఛసంకల్పం–నా ఆలోచనలు' అనే అంశంపై పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. ప్రతిభ చూపిన పల్లవిని జీసీడీఓ ఉమామహేశ్వరి, మండల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రమదానంతో ఆనకట్టకు మరమ్మతులు



ఇసుక బస్తాలతో సూరన్న ఆనకట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన రైతులు

తుని రూరల్: మండలంలోని డి.పోలవరం శివారు సూరన్న ఆనకట్టకు రైతులు శ్రమదానంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదనీటి ప్రవాహానికి సూరన్న ఆనకట్ట ధ్వంసమైంది. దీంతో డి.పోలవరం పంట పొలాలకు, నారప్ప చెరువుకు చేరాల్సిన బొండిగెడ్డ వరదనీరు, తాండవ జలాలు నదిలోకి మళ్లిపోతున్నాయి. 800 ఎకరాల ఆయకట్టుకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం ఎప్పుడు మరమ్మతులు చేస్తుందో తెలియకపోవడంతో ఖరీఫ్ పంటలను కాపాడుకునేందుకు ఆయకట్టు రైతులు ఏకమయ్యారు. తాటి చెట్లను నరిక అడ్డంగా ఉంచి వాటిపై ఇసుక బస్తాలను పటిష్టంగా అమర్చే పనులు శుక్రవారం చేపట్టారు. దీంతో బొండిగెడ్డ, తాండవ జలాలు ఆయకట్టుకు, నారప్ప చెరువుకు చేరుతాయి. సుమారు 800 నుంచి 1000 ఇసుక బస్తాలు వేయాల్సి వస్తుందని రైతులు తెలిపారు.

వర్షంతో ఉపశమనం



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో నీట మునిగిన రహదారి



ఏలేశ్వరంలో రహదారిపై నిలిచిన నీరు

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడటంతో ప్రజలు ఊరట పొందారు. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. గత వారంరోజులు ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. రహదారులపై నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు: మండలంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షంనీరు రోడ్డు బాట పట్టింది. గతవారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

జగ్గంపేటకు విస్తరించిన ఫిషరీస్ యూనిట్



జగ్గంపేటలోని దేవి ఫిషరీస్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్

సామర్లకోట: మండలంలో పనసపాడు గ్రామంలో ఉన్న దేవి ఫిషరీస్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ జగ్గంపేటకు విస్తరించింది. ఈ యూనిట్‌ను వర్చువల్‌లో కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్ (ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ), ప్రహ్లాద్ జోషి (బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ). రవ్‌నీత్‌సింగ్ బిట్టు(ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి) గురువారం సాయంత్రం ప్రారంభించారని దేవి ఫిషరీస్ యాజమాన్యం స్థానిక విలేకర్లకు శుక్రవారం తెలిపారు.

ఈ పరిశ్రమ వలన ప్రత్యక్షంగా రెండు వేల మందికి ఉపాధి కలుగుతుందని వారు చెప్పారు. తమ పరిశ్రమ ద్వారా దేశ అభివృద్ధిలో భాగమైనందుకు గర్వంగా ఉందని తెలిపారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



ఏలేశ్వరం అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్ వీధిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు తక్కువ ధరకు ఆహారం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ప్రారంభించిందన్నారు. పేదలు అన్న క్యాంటీన్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బంది ఆదేశించారు. అనంతరం క్యాంటీన్‌లో ఎమ్మెల్యే భోజనం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు మూదినారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, బెల్లాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట సీహెచ్‌సీలో డెంటల్ ఓరల్ సర్జరీలు

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఇద్దరు వ్యక్తులకు డెంటల్ ఓరల్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ టి.ప్రణీత్ తెలిపారు. డెంటల్ ఓరల్ సర్జరీలను కాకినాడ జీజీహెచ్‌లో మాత్రమే చేస్తారని, అటువంటి సర్జరీలను జగ్గంపేట సీహెచ్‌సీలో డాక్టర్ ఎస్.శంకర్‌రావు విజయవంతంగా చేశారని వివరించారు. తునికి చెందిన ఎస్.నూకరాజు, కత్తిపూడి గ్రామానికి చెందిన పి.యర్రయ్యకు ఉచితంగా సర్జరీలు చేసినట్లు తెలిపారు.

'ఇది మంచి ప్రభుత్వం'పై అధికారులతో సమీక్ష

కోటనందూరు: ఈ నెల 26 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ×ఇది మంచి ప్రభుత్వం× కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్ సుబ్రహ్మణ్యశర్మ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఓ అధికారిని పర్యవేక్షకునిగా నియమించామన్నారు. ఇంటింటికీ ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలు అతికించేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీ

మాజీ ఎంపీ హర్షకుమార్

తొండంగి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళితులకు రాజ్యాధికారం సాధన కోసం ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. మండలంలోని కోదాడలో శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు మద్దతు తెలిపాయన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఎస్సీ వర్గీకరణ చేస్తామని మేనిఫెస్టోలో తెలపాయన్నారు. కమ్యూనిస్టు, మావోయిస్టు పార్టీలు కూడా అదే దోరణిలో ఉన్నాయన్నారు. రాజకీయంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని వాపోయారు. దళితుల హక్కుల సాధన కోసం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ మేరకు త్వరలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఇప్పటికే కేసు వేశామన్నారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు మళ్లీ తీర్పు ఇచ్చేవరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏలేశ్వరం కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ఎస్.విజయబాబు కోరారు. పర్యావరణ పరిరక్షణపై ముద్రించిన కరపత్రాలను శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని షాపుల యజమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే ప్రజలు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గోళ్ల నాగేశ్వరరావు, వేల్పుల సూరిబాబు, కోరాడ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, ఫణి శర్మ, నరసింహరావు, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్కులు అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకోవడంతో శుక్రవారం స్థానిక సత్యదేవ కల్యాణ మండపంలో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం పేరిట ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోతుల నెహ్రూ పలు అంశాలపై మాట్లాడారు. ప్రజలు రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని త్వరలో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. కాగా జగపతినగరం కొండయ్యపేటలో అనుమతులు లేకుండా జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి



భూపతిపాలెం గురుకుల పాఠశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

గోకవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నా వసతి గృహాలను పట్టించుకోలేదన్నారు. ప్రధానంగా భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు లేక గెస్ట్ టీచర్లతో పాఠాలు బోధిస్తున్నారని విమర్శించారు. అలాగే డార్మెట్రీలు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని, డార్మెట్రీలను పూర్తి చేసి ఇతర మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి పవిత్రతను కాపాడాలి

జగ్గంపేట: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇర్రిపాక శివాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో భక్తుల మనోభావాలు దెబ్బ తీసేవిధంగా కల్తీ నెయ్యి వాడటానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.